ప్రఖ్యాతుని భార్య

నాభర్త కవి! రచయిత. మంచి ప్రఖ్యాతి గడించిన వారిలో ఒకరు. అందులో ముఖ్యంగా స్త్రీల కష్టసుఖాలను బాగా అర్ధంచేసుకొని, వాటి నివారణకై కృషిచేస్తున్న రచయితగా ఆయనకు మంచి పేరువుంది. ఆయన రచనలంటే పురుషులకన్న స్త్రీలకే ఎక్కువ మక్కువ.

ఇటువంటి వ్యక్తికి భార్యనైనందుకు నన్నుచూచి చాలా మంది అసూయపడటంకూడా నేను ఎరుగుదును. వాళ్ళకేం తెలుసు, నాబోటివాళ్ళ అగచాట్లు? ఈ మధ్య వారికి పెద్ద సన్మానం జరపాలని ప్రయత్నాలు జరిగినై. వారి రచనలను గురించి, వారి ప్రతిభను గురించి ఒక 'సావెనీర్' వెయ్యాలనికూడా వారి అభిమానులు సంకల్పించారు.

ఈ సందర్భంలో చాలామంది స్త్రీలు మా ఇంటికి వొస్తుండేవారు. వారి అలవాట్లను గురించి, అభిమానాలను గురించీ నన్ను రకరకాలుగా అడుగుతుండేవారు.

అందులో ఒకమ్మాయి "వారి భార్య అయినందుకు మీకు ఎలావుందో చెప్పండి" అని అడిగింది.

"అసహ్యంగావుంది, ఆముదం తాగినట్లుగావుంది" అని చెబుదామని నోటిదాకా వచ్చింది. మెదలకుండా ఊరుకున్నాను. ఊరుకున్నాను అంటే వారాయన్ని గురించి అంత గొప్పగా అనుకుంటూవుంటే నేను ఏమి చెప్పి ఏం ప్రయో

జనం? అప్పటికే ఆయన అభిమానులు చాలామంది నేను ఆయనకు తగ్గ భార్యను కాదని చెప్పుకోవటం నేను ఎరుగుదును. అలా చెప్పుకోటానికి ఆయనకూడా కొంత కారణం.

స్త్రీలలో కొంతమందికి ఆయనంటే అభిమానం అని చెప్పానుగదూ. ఆయనకు స్త్రీలతో స్నేహం చేయటం సరదా! తను వ్రాసినవి వారికి చదివి వినిపించి, వారిచేత చదివించుకొని విని సంతోషిస్తూ వుండేవారు. మొదట్లో తాము వ్రాసినవి నన్ను చదివి వినిపించమనేవారు. వినిపించేదాన్ని. కాని నాకు చాలా విసుగ్గా వుండేది.

"నువ్వు మనస్సుపెట్టి చదవటంలేదు" అనేవారు.

"ఇంకెలా?" అని అడిగేదాన్ని.

"ఆ రచనలోవున్న అందం నీవు గ్రహించినట్టు లేవు" అనేవారు; అని అందులోవున్న అందాన్ని వ్యాఖ్యానించి, వ్యాఖ్యానించి చెపుతుండేవారు.

"అర్థం అయిందా?" అని అడిగేవారు.

ఎందుకు వచ్చిన గొడవ అని, "అయింది" అనే దాన్ని.

"ఏమయింది-చెప్పుచూతాం" అనేవారు.

ఏమి అన్యాయం ఇది? నాకసలే ఆ రచన బాగుండేది కాదు. పైగా చదువుతున్నంతసేపూ బాధగా వుండేది. బాధ ఎందుకంటారా? ప్రతి రచనలోనూ ఆయన వొక స్త్రీని ఆరాధించటం, పువ్వులతో పూజించటం, ఆ స్త్రీకూడా తనపట్ల ప్రేమను చూపించటం, చివరికి ఎడబాటు కలగటం, ఆమె గడ

వలో నిలబడి రెండు కన్నీటిబొట్లు రాల్చటం, తాను గడప మెట్లకింద నిలబడి, మరి రెండు కన్నీటిబొట్లు రాల్చటం జరుగుతూ వుండేది. తరువాత ఆమె నేత్రాల వర్ణనా, జడలో తురిమిన పువ్వులవర్ణనా, శరీరం వొంపుల వర్ణనా వుంటూ వుండేవి. ఇక నేను బాధపడకుండా ఎట్లావుండేటట్లు? నేను ఆయన భార్యను. కష్టసుఖాలలో భాగస్వామిని. ఆయన సుఖంకోరి, రాత్రింబగళ్ళు కష్టపడుతున్నాను. నేనూ చదువుకున్నదాన్నే; కావాలంటే ఉద్యోగంలో జేరి హాయిగా కాలం గడపగలిగినదాన్ని. ఆయనకోసం అన్నీ మానుకొని, ఇంటిని అంటిపెట్టుకొని వున్నదాన్ని. ఆయనకు ఎక్కడ ఏలోటు వస్తుందో అని వెయ్యి కన్నులతో కనిపెడుతూ, అన్ని పనులూ నేనే చేసి పెట్టేదాన్ని. ఇటువంటి నాకు, ఆయన మరొక స్త్రీని గురించి అలా తపనపడుతున్నట్లు వ్రాస్తుంటే బాధగా వుండక ఏమవుతుంది?

ఒకరోజు అడిగాను—"ఎవ్వరా స్త్రీ?" అని.

ఆయన వొకక్షణం ఆశ్చర్యంగా చూచి, "నువ్వే అనుకోరాదూ?" అన్నారు.

నేనే అనుకోవాలట! నేను కాదని నాకు తెలుసాయె. ఇక నేను అని అనుకోవటం ఎలా? నేనే అయితే ఈ విరహం దేనికి? ఈ కన్నీటిబొట్లు దేనికి? ఎప్పుడూ ఇంట్లోనే ఆయనను కనిపెట్టుకొని వుంటూనే వుంటినిగదా!

"ఎందుకండీ ఈ అబద్ధాలు?" అన్నాను.

ఈ మాటకు ఆయన నన్ను రెండుక్షణాలు తదేక ధ్యానంతో చూశారు. ఏమీఅనలేదు. అక్కడనుంచి నెమ్మ

దిగా వెళ్ళిపోయారు. రెండురోజులు నాతో ఎక్కువ మాట్లాడ లేదు. ఏదో ఆలోచిస్తూ వున్నట్లు వున్నారు. నాతో అబద్ధం చెప్పినందుకు నొచ్చుకుంటున్నారనీ, ఇక నాతో ఎటువంటి అబద్ధాలు చెప్పరనీ సంతోషించాను. మూడోరోజు ఆయ నంత ఆయనే నన్ను మాట్లాడించి, "నీతో నిజం చెప్పటానికి వొచ్చాను" అన్నారు.

ఒక్కసారిగా నామనస్సు సంతోషంతో నిండిపోయింది. ఏవిషయమో తెలిసుండికూడా, ఆయనచే చెప్పించుకొని వినాలని, "ఏ విషయమండీ?" అని అడిగాను.

"మొన్న నీవు అడిగిన విషయం!"

"పోనిద్దురూ, ఇప్పుడెందుకు ఆ గొడవ" అన్నాను. నిజంగా వొకరు చేసినపనికి పశ్చాత్తాపపడుతుంటే వినటం కష్టంగా వుంటుంది. అందులో దగ్గరివాళ్ళ పశ్చాత్తాపం విన టం మరీ కష్టం. అందుకని అలా అన్నాను.

"కాదు. నువ్వు వినాలి" అన్నారు.

"అయితే చెప్పండి"

"ఎవ్వరో వొక స్త్రీని మనస్సులో పెట్టుకొని నేను రచనలు చేస్తున్నానని నీవు అనుకోవటం అన్యాయం..."అని మొదలు పెట్టారు.

నాకు మళ్ళీ కోపం వచ్చింది. "మరి నన్నుగురించి వ్రాస్తున్నాను అంటారేంగా" అన్నాను.

"అందులో అబద్ధంలేదు. నిన్నుగురించి వ్రాస్తు న్నాను. ఇంకా అనేకమంది స్త్రీలనుగురించి వ్రాస్తున్నాను.

స్త్రీలలో వున్న అందాలనూ, సౌకుమార్యాన్నీ. వెలుగులనూ, పోశరాశిగాపోసి, ఒక దివ్యమంగళ విగ్రహాన్ని సృష్టించుకొని ఆ విగ్రహాన్ని ఆరాధిస్తున్నాను..." అన్నారు.

"కాబట్టి మీ ఆరాధనలో నేను లేనట్లేగా!"

"ఇతరులు వున్నంతవరకూ నీవూ వున్నావు."

"మీకు అనేకమంది స్నేహితురాండ్రు వున్నారు గదా, వాళ్ళతో ఈ విషయం చెప్పారా?"

"మీరు ఆరాధించేది ఎవ్వరిని అని వారెవ్వరూ నన్ను అడగలేదు...."

"వారు అడిగి వుండరు. నిజమే, ఎందుకంటే వారిలోని ప్రతివొక్కరికీ, ఆ దివ్యమంగళ విగ్రహం నీవే అనే భ్రాంతిని మీరు కలిగిస్తున్నారు. ఎవ్వరికివారు మీరు వ్రాస్తున్నది తమని గురించే అని ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు." అన్నాను.

వారింకేదో చెప్పబోయారు. నేను వినలేదు. ఆ రోజు నుంచీ మా ఇద్దరిమధ్యా నిజంగానే పెద్ద అగడ్త ఏర్పడింది. అప్పటినుంచీ ఆయన తన స్నేహితురాండ్రతో నన్నుగురించి చెప్పటం ప్రారంభించారు. చెప్పటం అంటే నేనేదో దోషం చేసినట్లుగా కాదు. స్త్రీలపట్ల అత్యంత సానుభూతి వున్న ఆయన స్త్రీని ఆరాధ్యదైవంగా కొలిచే ఆయన నన్నుగురించి మాత్రం పెద్ద దోషంగా ఎలా చెప్పగలుగుతారు? "ఆమె అంటే నాకు అపరిమితమైన ఇష్టం. కాని ఆమెనన్ను అర్థం చేసుకోలేదు" అని మాత్రమే చెప్పేవారు. చెప్పి రెండు కన్నీటిబొట్లు రాల్చేవారు.

వారి అభిమానులకు నన్నుగురించి ఊహించటానికి అంతవరకుచాలు. నన్నుగురించి ఎన్నో ఊహించటమేకాక, అందరికీ చెప్పేవారు. చివరికి వారు మా ఇంటికి రావటం మానివేశారు. నేను ఎక్కడన్నా కనుపించినా నన్ను పలకరించేవారుకాదు. నన్నుచూచి వారిలోనేవారు గుసగుసలాడుకునేవారు. నాకు చాలా కష్టంవేసేది. నాభర్త వాళ్ళకు స్నేహితుడా? నేను వాళ్ళకి విరోధినా? ఎందుకు?

"ఇదేమీ బాగాలేదు" అన్నాను నా భర్తతో.

"ఏది?"

చెప్పాను. చెప్పి, "నేనంటే వాళ్ళకి గిట్టనప్పుడు మీరు వాళ్ళతో ఎందుకు స్నేహం చెయ్యాలి?" అని అడిగాను.

"స్నేహంచేస్తే తప్పేముంది?"

"నేను మీకు సరిపడని మగవాళ్ళతో స్నేహంచేస్తే మీ కెట్లావుంటుంది చెప్పండి?" అన్నాను.

"ఎవ్వరికి వుండే స్నేహితులు వారికి వుంటారు. అందులో తప్పేమివుంది" అన్నారు. "నీఇష్టంవచ్చిన వారితో నువ్వు స్నేహంగావుండు. నిన్నేమన్నా అడిగితే అప్పుడు అడుగు" అన్నారు.

ఆయన మాటలధోరణిబట్టి చూస్తే ఆయనకు నేను ఇతరులతో స్నేహాలు చెయ్యాలనే ఆతురత వున్నట్లు నాకు అనిపించింది. వారికిమల్లే నేను స్నేహాలుచేస్తే ఇంట్లో సణుగుడు ఉండదని ఆయన భావించినట్లున్నారు. అప్పటికీ తన స్వార్థమే. అప్పటినుంచీ నాకు ఆయనమీద వున్న గౌరవం కాస్తా పోయింది.

ఇక ఆయన్ని గురించి ఎక్కువ పట్టించుకోగూడదు-అనుకున్నాను. ఏదో వ్యాపకం కల్పించుకొని అందులో నిమగ్నురాలనయి వుండేదాన్ని. ఆయనకూడా నా సంగతి పట్టించుకోకుండా తిరుగుతుండేవారు. కాని ఎంత ప్రయత్నించినా నా జీవితాన్ని గురించి నేను ఆలోచించకుండా వుండలేకపోయేదాన్ని. వివాహానికి పూర్వపురోజులుజ్ఞాపకం వొస్తూ వుండేవి. అంతకుముందు వారి పుస్తకాలు కొన్ని నేను చదివాను. ప్రతి పుస్తకంలో వారేదో బాధపడుతున్నట్టు కనుపించేది. తనకు అందని దేనికోసమో ఆరాటపడుతున్నట్టూ, అన్వేషిస్తున్నట్టూ కనుపించేది. ఆ పుస్తకాలు చదువుతుంటే వారిమీద నా కెంతో జాలికలిగేది. వారి బాధను నేను నివారింపగలను అనిపించేది. ఏదో మాటామాట మీద, ఆయన రచనా వైదగ్ధ్యాన్ని గురించి వొక సమయంలో నా స్నేహితురాంద్రతో ప్రస్తావించాను. ఈ సంగతి వారి చెవులకు ఎట్లా జేరిందో జేరింది.

ఆ రోజునుంచీ వారు మాయింటికి వస్తుండేవారు. తెల్లవారి, ఇన్ని ఎర్రకలువలు పట్టుకొనివచ్చి నా కిచ్చి పోతుండేవారు. ఎక్కువ మాట్లాడేవారుకాదు.

"మీకోసం తెచ్చాను" అనేవారు. "దోసిలిపట్టండి" అని చెప్పి దోసిలినిండా పోసి పోయేవారు.

"ఎందుకే అట్లా పువ్వులు తెచ్చిపోసి పోతుంటాడు" అని అడిగేది మా అక్క.

"ఏమోలేవే, ఆయనది పిచ్చి ఆనందం" అనేదాన్ని.

కాని మావాళ్ళెవ్వరికీ ఆయన రాకపోకలు ఇష్టంగా వుండేవికావు. ఆసంగతి ఆయనకు తెలుసు. అయినా

రాకుండా వూరుకునేవాడు కాదు. వొచ్చి, ఆయన ఇంతకు ముందు ప్రేమించిన యువతులను గురించీ, వారికోసం తాను చేసిన త్యాగాలనుగురించీ చెప్పి, చివరకి వారు తన ఆశల నన్నీ ఏ విధంగా అడియాసలను చేసిందీ చెపుతుండేవారు. ఆ సంగతులన్నీ చూస్తే నాకు చాలా జాలివేసేది. నన్ను గొప్పచేసి తన కష్టసుఖాలను చెప్పుకుంటూ వుంటే, ఆ రోజుల్లో నాకు బాగానే వుండేది. ఆ వయస్సు అటువంటిది అనుకుంటాను.

చివరికి ఆయన తనను వివాహం చేసుకోమని అడిగారు, మా వాళ్ళకి ఎవ్వరికీ ఇష్టంలేకపోయినా నేను అంగీకరించాను.

"ఏం సుఖపడదామనే?" అని అడిగింది అక్క.

నే నేమీ సమాధానం చెప్పలేదు. చెప్పినా వాళ్ళకి అర్థంకాదని ఆ రోజుల్లో నేను అభిప్రాయపడుతూ వుండేదాన్ని.

మా వివాహం జరిగింది.

ఇవనీ జ్ఞాపకంవచ్చి, ఆనాటికీ ఈనాటికీ వున్న తేడా స్ఫురణకు వచ్చి, కళ్ళవెంట నీళ్ళు జలజలారాలిన్నై. జీవితం అంధకారబంధురంగా కనుపించింది. 'నాకడుపున వొక కాయకాచినా బాగుండేది' అనిపించింది. ఆ ప్రాప్తంకూడా లేదు. ఇక ఇప్పుడు చేసేది ఏముంది? రోజులు జరగనీ, ఎన్నాళ్ళు జరుగుతవో అనుకొని వూరుకున్నాను.

ఒకరోజు నేను, నా చేతి మిషన్మీద పొరుగింటి పేద పిల్ల లంగా కుట్టిపెట్టమని అడిగితే కుట్టిపెడుతున్నాను.

వారు హడావిడిగానే, పేరుపెట్టి పిలుస్తూ నా గదిలోకి వచ్చారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఈమధ్య వారు నన్ను పేరుపెట్టి పిలిచి ఎరుగరు. అందులో ఆ కంఠధ్వని అతివిచార కరంగా వుంది. తల పైకెత్తి చూశాను. ఏమిటది? ఆయన జుట్టు రేగివుంది. చొక్కా చేతిమీద చిరిగివుంది. పైజమా మట్టికొట్టుకొనివుంది. క్షణంలో పదేళ్ళ వయస్సు పెరిగినట్లు కనుపించాడు.

"నువ్వు నాకొకసహాయం చెయ్యాలి" అన్నారు.

"ఏమిటండీ!"

"నువ్వు రామచంద్రరావుగారిని ఎరుగుదువా..." అని ప్రారంభించారు.

"ఎవ్వరు? ఈ మధ్యనే సబ్ ఇన్‌స్పెక్టరుగా వచ్చారు"

"అవును. నేను ఇవ్వాళ, అంటే ఇంతకుముందే వారింటికి వెళ్లాను..."

"ఎందుకు వెళ్ళారు?"

"చూద్దామని వెళ్ళాను"

"ఎవ్వరిని?"

"వారినే..."

"కాదు. వారి అమ్మాయిని చూద్దామని వెళ్ళివుంటారు..." అన్నాను. వారి అమ్మాయిని కొద్దిరోజులకు పూర్వమే నేను వొక మీటింగులో చూశాను.

ఈ మాటలకు "నువ్వుకూడా నన్ను అపార్థం చేసుకుంటే ఎలా చెప్పు." అని కన్నీరు పెట్టుకున్నారు వారు.

"పోనీలెండి. ఎందుకు వెళితేనేం. వెళ్ళారు. ఏం జరిగిందో చెప్పండి" అన్నాను.

"నేను వెళ్ళేటప్పటికి రామచంద్రరావుగారు వాకిట్లోనే వెళ్ళటానికి వీల్లేదని బయటకు నెట్టి వేశారు..." అన్నాడు.

రేగిన జుట్టూ, చినిగినచొక్కా మట్టికొట్టుకున్న పైజమా చూచి, వారు చెప్పిందానికంటే పెద్దగ్రంథమే జరిగి వుంటుందని నేను ఊహించాను.

"చూట్టానికి వొచ్చినవారిని నెట్టివెయ్యటం ఏమిటండీ?" అన్నాను.

వారు వొక్క నిట్టూర్పు విడిచి, "నువ్వనుకున్నట్లే ఆయనా తన కూతుర్ని చూట్టానికి వొచ్చాననుకున్నాడు..."

ఇక మిగిలిన సంగతి ఊహించటం ఏ మంతకష్టం కాదు. వారు కొద్దిరోజులనుంచి పువ్వులు పట్టుకొని వారింటికి వెళుతూవుండి వుండాలి. వారి అమ్మాయితో కబుర్లు పెట్టుకొని వుండాలి. అది వారికి ఇష్టంవుండి వుండదు. ఇంకేం? జరగవలసింది కాస్తా జరిగివుంటుంది.

నాకు చీదరవేసి, "ఇప్పుడు ఏం చెయ్యమంటారు నన్ను?" అని అడిగాను.

"నువ్వు వాళ్ళ ఇంటికి వొకసారివెళ్ళి రావాలి?"

"దేనికి?"

"ఆ సబ్ఇన్స్పెక్టరు తన కూతుర్ని హింసిస్తూ వుంటాడు-అతను నన్నేంచేసినా నేను సహించగలను గాని, ఆ

అమ్మాయిని నా మూలంగా కష్టపెట్టడం సహించలేను..."

"అంతవరదాకా ఎందుకు వస్తుందండీ! మీరు ఆ అమ్మాయిని చూడనేలేదు అంటిరిగదా!"

"చూశాను. వొకటి రెండుసార్లు చూశాను."

నేనిక తరచదలచలేదు. అమాయకత్వంవల్ల నిజంగానే ఆ అమ్మాయి చిక్కుల్లో బాధల్లో పడ్డదేమో అని అనిపించింది. చేతనైతే వారు చేసిన తప్పులను సరిదిద్దాలనిపించింది.

"సరే, నేను వెళ్ళివస్తాను. వీలైతే రామచంద్రరావుగారు మీ జోలికి రాకుండా చేస్తాను. అయితే మీరు నాకొక వాగ్దానం చెయ్యాలి." అన్నాను.

"నువ్వు ఏంచెయ్యమంటే అది చేస్తాను."

"ఇక ఇటువంటి పనులు చెయ్యనని వాగ్దానం చెయ్యండి."

"అలాగే," అని వాగ్దానం చేశారు.

నేనారోజు సాయంకాలం ఏదోపనిమీద వెళ్ళినట్లు రామచంద్రరావుగారి ఇంటికి వెళ్ళాను. రామచంద్రరావుగారు ఇంకా ఆఫీసునుంచి రాలేదు. వారిఅమ్మాయి ముందుగదిలోకూర్చొని ఏదో చదువుకుంటూవుంది.

ఆ అమ్మాయికి పదిహేను పదహారు ఏళ్ళువుంటాయి. జీవితంలోని కృత్రిమం, మోసంఏమాత్రం దగ్గరకు రానిచ్చిన అమ్మాయికాదు. అమాయకురాలు.

నన్నుచూచి ఆ అమ్మాయి మొదట్లో ఆశ్చర్యపడింది. నేను అవీ ఇవీ మాట్లాడి ఆ అమ్మాయి పసిగట్టకుండానే

అసలు విషయంలోకి దించాను. ఆ అమ్మాయి వున్నసంగతి వున్నట్టు చెప్పివేసింది. ఏమీ కృత్రిమంలేదు. దాచుకోటానికి ప్రయత్నించలేదు. అతి సహజంగా చెప్పివేసింది.

నేను ఊహించింది నిజమే. మా వారు వారంరోజుల నుంచి వారి యింటికి వెళ్ళివస్తున్నారట. మొదట్లో ఆ అమ్మాయితో ఏవేవో సాహిత్యం గొడవలు మాట్లాడేవారట, తరువాత తాను వ్రాసినవి వినిపించేవారట. తరువాత తాను వ్రాసినవి చదివించుకునేవారట. మొదటినుంచి వాళ్ళ నాన్నకి ఆయన యింటికి రావటం ఇష్టంగా వుండేదికాదట. రెండు మూడు రోజులు గడిచినతర్వాత తనకుకూడాకష్టంగా ఉండేదట.

ఒకరోజు, "మీరు రావటం మా వాళ్ళకు ఇష్టం లేదండీ" అని చెప్పిందట.

"మీ వాళ్ళసంగతి నాకెందుకు? నీ సంగతి చెప్పు?" అన్నారుట.

"నా సంగతేముందండీ? మావాళ్ళ ఇష్టాయిష్టాలను బట్టిపోయేదాన్నే నేను" అన్నదట.

"అది తప్పు. ఎవ్వరి ఇష్టం ప్రకారం వాళ్ళం పోవడం ధర్మం. భగవంతుడు మెచ్చుతాడు. నీవు రావొద్దంటే ఈ క్షణంనుంచి రాను. లేకపోతే నన్నెవ్వరూ ఆపలేరు" అన్నారట మావారు.

"నాకుకూడా మీరిలా రాకుండా వుండడమే మంచిదని అనిపిస్తూ వుందండీ" అన్నదట ఆ అమ్మాయి.

"తన జోలికి రావ ద్దన్నది"

"నువ్వు పొరపాటు పడుతున్నావు. అది ఆమె అభిప్రాయంకాదు. ఆమె తండ్రి వున్నాడే–సబ్ ఇన్ స్పెక్టరు, అతనికి భయపడి అలా అన్నది. ఆమెకు నేనంటే......" అని ప్రారంభించారు.

అంతలో నా ముఖంలో వచ్చిన మార్పును గమనించి నట్లున్నారు; ఆపేశారు. నాకు సంభాషణ పెంచటం ఇష్టం లేక "మీ వాగ్దానం మరచిపోకండి" అని చెప్పి ఇంట్లోకి వెళ్లాను.

కాని ఏం లాభం? వారు వారి పద్ధతులను మరచి పోలేదు; మార్చుకోలేదు. సబ్ ఇన్ స్పెక్టరుకి భయపడి, ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళటం అయితే మానివేశారుగాని, ఇతరపోకడలు మానలేదు.

ఒకరోజు వారు చేసిన వాగ్దానం జ్ఞాపకం చేశాను.

"ఇందులో తప్పేమివుంది? మొగవాళ్ళలో, ఆడవాళ్ళల్లో స్నేహితులు వున్నట్లుగానే, మొగా ఆడవాళ్ళకు స్నేహం ఎందుకు వుండగూడదు? ఒక స్త్రీకీ వొకపురుషుడికీ, వొకరంటే వొకరికి ఇష్టంవుండవచ్చు. వారు స్నేహితులుగా వుంటారు. ఇందులో తప్పేమివుంది? ఆమాటకివొస్తే ఆంధ్రదేశంలో ఇటువంటి వుద్యమం వొకటి లేవనెత్తాలని ఆలోచిస్తున్నాను" అన్నారు.

"అప్పుడుగాని ఆంధ్రదేశంలో వున్న మకిల ప్రక్షాళన కాదు" అని ముగించారు.

నాకు వొళ్ళు మండింది. "ఈ సిద్ధాంతం మీవరకు బాగానేవుంది. తిని నలుగురి ఆడవాళ్ళతో తిరగవచ్చు. కాని ఆ ఆడపిల్లల గతేంకావాలి" అని అడిగాను.

"వాళ్ళకేం?" అన్నారు.

"వాళ్ళల్లో పెళ్ళి అయిన పిల్లలు వుండవచ్చు; కాని పిల్లలు వుండవచ్చు. ఏ నెపంతో మీతో తిరిగినా, పెళ్ళి అయిన పిల్లల భర్తలు ఊరుకుంటారా? పెళ్ళికాని పిల్లలకు పెళ్ళిళ్ళు అవుతాయా?" అని అడిగాను.

"ఇటువంటి స్నేహాలను నిష్కల్మష బుద్ధితో చూసే స్థితికి సంఘం రావాలి. అందుకే నేను కృషి చెయ్యదలిచాను" అన్నారు.

"సంఘం ఆస్థితికి వస్తుందో రాదో మీకూ తెలుసు, నాకూ తెలుసు. సంఘం ఆస్థితికి రావాలని మీరు ఎందుకు కోరుతున్నారో కూడా మీకూ తెలుసు, నాకూ తెలుసు. ఒక వేళ కారణాంతరాలచేత ఎప్పటికైనా సంఘం ఆ స్థితికి రానున్నా ఈలోగా ఎంతమంది అమాయకపుపిల్లల జీవితాలు బజారు కెక్కవలసివస్తాయో ఆలోచించారా? ఎన్ని కుటుంబాల్లో చిచ్చు రేగుతుందో ఊహించారా?"

దీనికిసమాధానంగా వారు, ఒక పెద్ద పోజుపెట్టి, "ఒక ఘనకార్యం సాధించ దలచినప్పుడు కొంతమంది ఆత్మార్పణం చేసుకోవలసి వుంటుంది మరి" అన్నారు.

విన్నారా? ఇదొక సిద్ధాంతమట. దీనివల్ల సంఘంలో వున్న మలినం క్షాళనం కాబోతున్నదట. ఇందుకు అమాయ

కపు పిల్లలు కొంతమంది ఆత్మార్పణం చేసుకోవాలట! నలుగురు ఆడవాళ్ళతో కలిసి తిరగటానికి ఎంత చక్కని మాటలు! ఆయన సంగతి పూర్తిగా తెలిసిన నాకే వొక్కొక్కప్పుడు పాపం, ఇవన్నీ నమ్మే చేస్తున్నారు కాబోలు-అని అనిపిస్తూ వుండేది. లోకాన్ని వంచన చేస్తున్నారో తన్ను తాను వంచన చేసుకుంటున్నారో తెలిసేదికాదు. నాసంగతి ఇలావుంటే, అభం శుభం తెలియని అమాయకపు పిల్లలసంగతి వేరే చెప్పాలా?

ఆయనకు ఏంచెప్పి ఏం ప్రయోజనం! ఏ విషయమైనా వింటారుగాని, ఈ విషయం దేవుడు చెప్పినా వినరు. ఈ విషయంలో ఎటువంటి స్నేహితులనైనా, ఎంత డబ్బయినా వొదులు కోటానికి సిద్ధమే. పైగా వొకటే నిజంచెప్పరు. ఆయన ఒకప్పుడు చెప్పారు-"స్త్రీ శరీరం వంపులుచూస్తే ఇక తరువాత ఏంచేస్తానో నాకే తెలియదు" అని. ఆయన చెప్పిన ఏకొద్ది నిజాలలోనో ఇదొకటి. అదొక జబ్బేమో అనిపిస్తుంది నాకు అప్పుడప్పుడూ.

అలా గడిచిపోయినై రోజులు. ఎప్పటికైనా వారికి జ్ఞానం కలుగకపోతుందా-అనే ఆశ ఈనాటికీ నన్ను వొదలకుండా వుంది. అటువంటి సమయంలో ఈ సన్మానం వొకటి వచ్చిపడింది. తన పనులను ఆంధ్రదేశం అంగీకరించి, ఆమోదించింది- అనేభావంతో ఈ సన్మానం సంగతి తెలిసినప్పటి నుంచీ ఆయన ప్రవర్తించటం మొదలు పెట్టారు—ఇక పిముక్తిలేదు.

ఇంకా సన్మానం నాలుగైదు రోజులుందనగా వాసు

నా దగ్గరకు వచ్చి, "సన్మానంనాడు నువ్వుకూడా మీటింగుకు రావాలి" అన్నారు.

"నేను రాను" అన్నాను.

"నువ్వు రాకపోతే ఎట్లా? లోకులు ఏమనుకుంటారు?" అన్నారు.

చూశారా? నేను రావాలనికాదు, నేను వచ్చి ఆయనకు జరుగుతున్న గౌరవంలో పాల్గొనాలనికాదు. నేను రాకపోతే లోకులు ఏమనుకుంటారో అని భయం.

"లోకులు అనుకునేది ఏముందిలెండి!" అన్నాను.

"లోకాన్నంతా సర్దగలుగుతాడు గాని ఇంట్లో వాళ్ళని సర్దుకోలేక పోతున్నాడు అనుకోరూ? లోకాన్నంతా మార్చగలుగుతున్నాడుగాని ఇంట్లో వాళ్ళని మార్చలేక పోతున్నాడు అనుకోరూ? నువ్వు తప్పకుండా రావాలి" అన్నారు.

నేను సన్మానానికి వెళ్ళలేదు. పైగా అక్కడేవుంటే ఎవ్వరు వచ్చి బలవంతపెడతారో అని ఆ నాడు సాయంకాలమే మా కన్నవారింటికి వెళ్ళిపోయాను.

సన్మానం అతివైభవంగా జరిగిందట. మా తమ్ముడు వెళ్లివచ్చి చెప్పాడు. వొస్తూ వొస్తూ, ఆయన ప్రతిభను ఉగ్గడించటానికిగాను వెలువడిన 'సోవెనీరు' వొక కాపీ పట్టుకొని వచ్చాడు. "నువ్వు రాలేదని చాలామంది అనుకున్నారు అక్కా" అన్నాడు. "వొకరిద్దరు తమ ఉపన్యాసాలలోకూడా ఉదహరించారు" అన్నాడు.

"ఏమన్నారేమిటి?"

వాడు చాలాసేపు చెప్పలేదు. అడగ్గా అడగ్గా, "సోక్రటీస్ అనే వొక ప్రముఖ తత్వవేత్త వుండేవాడట. అతని భార్య మహాగయ్యాళి అట. ఎప్పుడూ భర్తను వేపుకు తింటూ వుండేదట. అటువంటి భార్యలను టెస్ట్ కేసెస్ క్రింద మేధావులైన భర్తలకోసం భగవంతుడు సృష్టిస్తూ వుంటాడట అని, అనుకున్నారు" అన్నాడు.

మిగిలింది నేను ఊహించుకోగలను. నేను గయ్యాళి భార్యనా! ఆయన లోకానికి సేవ చేస్తూవుంటే నేను సహాయం చెయ్యకపోగా అసూయాద్వేషాలతో వేధిస్తూవుంటాను! ఆయన కాబట్టి ఎంతో ఓర్పుతో ఇంటిగుట్టు రచ్చకు కాకుండా నన్ను సాకుకు వస్తున్నారు! ఏమి అన్యాయం!

ఏమీతోచక తమ్ముడు తెచ్చిన "సావెనీర్" తిరగ వేస్తూ కూర్చున్నాను. మంత్రులు, జడ్జీలు, ప్రముఖ రచయితలు ఎంతోమంది స్త్రీలపట్ల మావారు చేసిన సేవను ప్రశంసిస్తూ అందులో వ్యాసాలు వ్రాశారు. నేను ఏం చెప్పను? నేను ఏం చెప్పితే ఎవ్వరు వింటారు? వీరంతా తెలిసి వ్రాశారా? తెలియక వ్రాశారా? తెలియక వ్రాశారు అనుకోటానికి కారణం కనుపించదు. అంతా మోసం. సంఘానిది నిలువెల్లా మోసమే! పుస్తకం మూసి ఆలోచించాను. ఎక్కడికి వెళ్తూవుం దీ సంఘం?